ఉత్తమ ప్రతిభ.. అత్యుత్తమ ప్రశంసలు

సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న సీఐ గురువయ్యగౌడ్

షాబాద్, మార్చి 23: హత్య కేసులో నిందితుడికి జీవిత కారాగార శిక్ష విధించడంలో కీలకపాత్ర పోషిం చి ఉత్తమ ప్రతిభ చూపించిన ట్రాఫిక్ అడ్మిన్ సీఐ గోపగాని గురువయ్యగౌడ్‌కు సైబరాబాద్ సీపీ ప్రశంసాపత్రాన్ని అందజేశారు. 2023 సంవత్సరంలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దామర్లపల్లిలో జరిగిన హత్య కేసులో అప్పటి సీఐగా గురువయ్యగౌడ్ పని చేస్తున్న సమయంలో ఇన్వెస్టిగేషన్ చేసి చార్జిషీట్ కోర్టులో దాఖలు చేయగా నిందితుడికి జీవిత ఖైదు శిక్ష పడింది. ప్రస్తుతం సీఐ గురువయ్యగౌడ్ ట్రాఫిక్ అడ్మిన్ ఇన్‌స్పెక్టర్‌గా సైబరాబాద్ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన రివార్డు మేళాలో సీఐ గురువయ్యగౌడ్‌కు ఈ ప్రశంసాపత్రాన్ని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి అందజేశారు. పోలీస్ శాఖలో తన కర్తవ్యాన్ని బాధ్యతను సక్రమంగా నిర్వర్తించినందుకు పోలీస్ అధికారులు సీఐ సేవలను ప్రశంసిస్తూ ప్రశంస పత్రాన్ని అందజేశారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

- ప్రియురాలు మృతి చెందిందనే బాధలో..
- ప్రభుత్వ హాస్టల్ భవనం పై నుంచి కిందికి..
- తీవ్ర గాయాలు, సర్కారు దవాఖానకు తరలింపు

షాద్‌నగర్ సర్కారు దవాఖానాలో వైద్యం పొందుతున్న విద్యార్థి చందు

షాద్‌నగర్, మార్చి 23 : ప్రేమించిన యువతి మృతి చెందిందనే బాధతో ఓ ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన షాద్‌నగర్ పట్టణంలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా కులకచర్ల మండలంలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన చందు షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ వసతి గృహంలో ఉంటూ ఇంటర్ చదువుతున్నాడు. ఇటీవలే ఇంటర్ పరీక్షలు పూర్తైన ఇంటికి వెళ్లకుండా వసతి గృహంలోనే ఉండి.. హాస్టల్ భవనం పై నుంచి కిందికి దూకి ఆత్మహత్నాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ప్రమాదంలో చందుకు తీవ్ర గాయాలు కాగా షాద్‌నగర్ సర్కారు దవాఖానకు తరలించారు. పోలీసులు ఆత్మహత్యాయత్నానికి గల కారణాలను ఆరా తీయగా కొన్ని రోజుల కిందట తాను ప్రేమించిన యువతి మృతి చెందిందనే బాధలో ఉన్నాడనే విషయం తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

శిల్పారామంలో..నృత్య ప్రదర్శనలు

కొండాపూర్ : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రొ. భాగవతుల సేతురాం ఆధ్వర్యంలో కూచిపూడి నాట్యగురువులు భాగవతుల రామకోటయ్య' శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించారు. లక్ష్మి, భావన, శ్రీ కృతి, ధన్యశ్రీ, శివాంజలి, శృతి, అన్విక, వైష్ణవి, చార్వి నృత్యరూపకం ఆకట్టుకున్నది.

అన్నమయ్యపురంలో..

మాదాపూర్ : అన్నమయ్యపురంలో అన్నమాచార్య భావనా వాహిని సంస్థ వ్యవస్థాపకురాలు, పద్మశ్రీ డా. శోభరాజు ఆధ్వర్యంలో ఆదివారం నృత్యప్రియ డాన్స్ అకాడమీ గురువు స్వప్నాకృష్ణమోహన్ శిష్య బృందం కశ్వి, హన్షిత, జాన్వి, యశస్విని, నిత్య తేజస్వి, భవ్య, ఆద్య, హషిక, హంసిని, తన్వి, జోషిత, నిత్యశ్రీ, రుగ్వేద, శ్రేష్ఠ, చార్వి, కీర్తన, భావేశ్, లోకేశ్, యష్మిత్ ప్రదర్శన అలరించింది. కళాకారులకు శోభరాజు జ్ఞాపికలు అందజేశారు. శ్రీ స్వరసిద్ధి వేంకటేశ్వర స్వామికి పూజలు చేశారు.

మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారు

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట: గ్రామాల్లోని ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సిరిగిరిపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు నాయకులు సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహేశ్వరి నియోజకవర్గానికి ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ రెడ్డి, బీఆర్ఎస్ మహేశ్వరం మండల యూత్ అధ్యక్షుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పూల రైతుకు దుఃఖం

- పొలాల్లో విరగబూసిన పూలు
- మార్కెట్‌లో అన్నదాతకు అందని ఆదాయ పరిమళాలు
- ధర లేక బిగాలు చెందుతున్న కర్షకులు
- పంటను చేనుల్లోనే వదిలేస్తున్న రైతన్న

మార్కెట్‌లో ధర లేకపోవడంతో కేశంపేటలో కోయకుండా చేనుమీదనే నిండుగా ఉన్న బంతిపూలు

కేశంపేట, మార్చి 23 : పూలసాగుతో లాభాలు అర్జించవచ్చన్న అన్నదాత ఆశలు అడిఆశలవుతున్నాయి. రూ.లక్షలు అప్పులు చేసి పూలతోటల సాగులో పెట్టుబడి పెట్టారు. పంట చేతికొచ్చాక తీరా మార్కెట్‌లో పూలకు ధర లభించడం లేదు. దీంతో పంటను చేనులోనే వదిలేయాల్సిన దుస్థితి నెలకొన్నది. మండల పరిధిలో చిన్న, సన్నకారు రైతులు బంతి, గులాబీ, కనకాంబరం, మల్లె తదితర పూలతోటలను మండల వ్యాప్తంగా 123ఎకరాల్లో పూలసాగు చేసినట్లు ఉద్యానవన శాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఎకరానికి రూ.70వేలకు పైగా ఖర్చుచేసి పూలతోటలు సాగు చేస్తే మార్కెట్‌లో ధర పలకడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూలకు ధర లేకపోవడంతో పూలు కోసేందుకు వచ్చే కూలీలకు సైతం డబ్బులు ఎల్లడం లేదని, మార్కెట్‌కు తరలించేందుకు ఆటోల చార్జీలు కూడా రావడంలేదని వాపోతున్నారు. కేశంపేటకు చెందిన నిదురం చెన్నయ్య అనే రైతు సర్వే నంబర్ 760లో అర ఎకరా పొలంలో బంతి పూల తోటను సాగు చేశాడు. నారు మొదలు మొక్కల పెంపకం, వాటిని కాపాడుకునేందుకు కావాల్సిన రసాయన ఎరువులను పిచికారీ చేశాడు. పంట చేతికొచ్చాక మార్కెట్‌లో ధర లేకపోవడంతో చేసేది లేక చేనులోనే వదిలేసినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ధరలు లేక పూలు కోయడం మాని వేశానని, పూలు కోసి కూలీ డబ్బులు మీద వేసుకోవడంకన్నా చేనులోనే వదిలేయడం నయమని వదిలేసినట్లు చెబుతున్నాడు.

పడిపోయిన పూల ధరలు..

ఒక్కసారిగా పడిపోయిన పూల ధరలు మార్కెట్‌లో ఇలా ఉన్నాయి. సీజన్‌లో రూ.120వరకు పలికే బంతి కిలో రూ.40వరకు పడిపోయింది. ఇక చామంతి సీజన్‌లో రూ.200వరకు పలుకుతుందని, ప్రస్తుతం కిలో 60కి వస్తుంది. సీజన్‌లో కిలో గులాబీ రూ.250పలుకుతుండగా ప్రస్తుతం కిలో రూ.30కి దిగజారింది. కనకాంబరాలు కిలో సీజన్ సమయంలో రూ.1200 నుంచి రూ.2వేల వరకు పలుకుతుంది. ప్రస్తుతం కిలో రూ.400కు చేరుకుంది. ఇక మల్లె సీజన్‌లో రూ.1200వరకు పలకగా ప్రస్తుతం కిలో మల్లెపూల ధర రూ.400 విక్రయిస్తున్నారు. పూల ధరలు లేకపోవడంతో రైతులు పూలను కోయకుండా చేనులోనే వదిలేస్తున్నారు. పూలసాగుతో తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం స్పందించి పూలసాగు చేసిన చిన్న, సన్నకారు రైతులను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ప్రతి గ్రామంలోనూ రైతు పల్లెబాట

లింగంపల్లిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి

నవాబుపేట, మార్చి 23 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు గ్రామగ్రామనా రైతు పల్లెబాట నిర్వహిస్తున్న ట్లు బీఆర్ఎస్ నవాబుపేట మండల అధ్యక్షు డు అంతమోళ్ల దయాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఏక్‌మామిడి, కుమ్మరిగూడ, గేట్‌వనంపల్లి, కడ్చర్ల, మీనాపల్లి కలాన్, లింగంపల్లి గ్రా మాల్లో పార్టీ మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన రైతు పల్లెబాటలో భాగం గా పర్యటించారు. ప్రతి గ్రామంలోనూ రైతుల వద్దకు వెళ్లి వారు పడుతున్న బాధలను ఓపికగా అడుగుతూ పోస్టుకార్డులపై వారి పేర్లు రా సి సమస్యలను సీఎం కార్యాలయానికి పంపా రు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనను గాలికొదిలేసి కేసీఆర్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చే యాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గౌర వ అధ్యక్షుడు పట్లోళ్ల భరత్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు జగన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పోలీ సు మహేశ్వర్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు శాంతికుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి మాణిక్‌రెడ్డి, మండల ప్రచార కార్యదర్శి ఆశిరెడ్డిగారి వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు సంతోశ్‌రెడ్డి, పులుమామిడి గ్రామ అధ్యక్షుడు రాఘవేందర్, మండల అధ్యక్షురాలు రాణీగౌడ్ ఉన్నారు.

హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిని విస్తరించాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఆదివారం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిశన్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. - కడ్తాల్, మార్చి 23

తుర్కయాంజాల్ మాసబ్ చెరువును ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 205లో పోసిన మట్టిని తొలగించాలని, రెండేండ్లుగా చెరువులో ఉన్న వినాయక వ్యర్థాలను తొలగించడంతో పాటు కబ్జాకు గురవుతున్న చెరువును పరిరక్షించాలని కోరుతూ మాసబ్ చెరువు పరిరక్షణ సమితి అధ్యక్షుడు బచ్చిగళ్ల రమేశ్ ఆధ్వర్యంలో ఆదివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. - తుర్కయాంజాల్, మార్చి 23

కుక్కల దాడిలో జింక మృతి

పోతిరెడ్డిపల్లిలో కుక్కల దాడిలో మృతి చెందిన జింక

దోమ, మార్చి 23 : కుక్కల దాడిలో జింక మృతి చెందిన ఘటన దోమ మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో జరిగింది. గ్రామస్తులు, అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాలు.. గ్రామంలోని పోతిరెడ్డిపల్లి చెరువు దగ్గరకు ఆదివారం ఉదయం దాహం తీ ర్చుకునేందుకు వచ్చిన జింకను కుక్కలు వెంబడించాయి. పరుగెత్తి అలసిపోయిన జింక ఫెన్సింగ్ జాలిలో ఇరుక్కోవడంతో కుక్కలు దాడి చేశాయి. జింక తొడ భాగాల్లో తీవ్ర గాయాలు కావడంతో గమనించిన యువకులు వెం టనే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని గాయ పడిన జింకను వైద్యం కోసం పరిగి దవాఖానకు తరలించారు. జింకకు వైద్యం అందిస్తున్న క్రమంలో కొంత సమయం తర్వాత జింక మృతి చెందినట్లు ఫారెస్ట్ అధికారి ఓంప్రకాశ్ తెలిపారు.

లెగ్.. ప్లేయింగ్.. ఈటింగ్..!

బెట్టింగుల కోసం కోడ్ భాష

సిటీలో జోరుగా సాగుతున్న బెట్టింగులు

సిటీబ్యూరో: ఐపీఎల్ సీజన్ మొదలైంది. హైదరాబాద్‌లో బెట్టింగులు జోరుగా సాగుతున్నాయి. ఒకవైపు బెట్టింగ్ యాప్‌లపై పోలీసులు సీరియస్‌గా దృష్టిపెట్టి ప్రమోటర్స్‌పై కేసులు పెడ్తుంటే మరోవైపు బెట్టింగ్ మాఫియా ఇవేవీ పట్టనట్లు తమ పని తాము చేసుకుపోతున్నది. క్రికెట్ మ్యాచ్‌ల సందర్భంలో పలు నిషేధ బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ నడుస్తున్నది. ఈ బెట్టింగ్‌లో ఎక్కువశాతం యువతే పాల్గొని డబ్బులు కోల్పోతున్నట్లు పోలీసులు చెప్పారు.

కోడ్ భాషతో బెట్టింగ్..!

పందేలు కాసేవారు బుకీల దగ్గర కోడ్ భాష వాడుతూ తమ ఆట కొనసాగిస్తున్నారు. బెట్టింగ్‌లో గెలిచినవారికి డబ్బులు ఎలా ఇవ్వాలో కూడా ముందుగానే మాట్లాడుకుంటున్నారు. బెట్టింగ్‌లో పాల్గొంటున్న యువత వాడే కోడ్ భాషలో లెగ్ అనే పదం కీలకమైంది. ఎన్ని లెగ్గులు తీసుకుంటే లెక్క ప్రకారం అంత మొత్తం చెల్లించాలని దాని అర్థం. అలాగే గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్న జట్టుపై పందెం కాసేందుకు ప్లేయింగ్ అనే పదాన్ని, తక్కువ అవకాశాలున్న జట్టుపై ఈటింగ్ అనే పదాలు వాడుతున్నారని పోలీసులు తెలిపారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో సుమారుగా 180 చోట్ల ఈ బెట్టింగులు జరుగుతున్నట్లుగా పోలీసులు గుర్తించారు. మరోవైపు నగర సీపీ సీవీ ఆనంద్ సీరియస్‌గా ఉన్నారు. బెట్టింగ్‌లకు పాల్పడినా, వారికి ఎవరూ సహకరించినా కఠిన చర్యలు తప్పవంటూ హెచ్చరిస్తున్నారు.

ఈసారి వరద ముంపు తథ్యం

నాలా పూడికతీతపై బల్దియా మీనమేషాలు
టెండర్ దశలోనే సమయం వృథా
మార్చి ముగుస్తున్నా.. మొదలు కాని పనులు
మే నెలాఖరు నాటికి లక్ష్యం
చేరుకోవడం అసాధ్యమే
నగరానికి పొంచి ఉన్న వరద బాధలు

సిటీబ్యూరో, మార్చి 23 (నమస్తే తెలంగాణ) : నాలా పూడికతీత పనులపై జీహెచ్ఎంసీ నిర్లక్ష్యం వహిస్తోందా? డిసెంబర్ నెలలో నాలా పనులకు టెండర్లు ముగించాల్సిన అధికారులు మార్చి ముగింపు వచ్చినా నేటికీ టెండర్ల దశలోనే కాలయాపన చేస్తోందా? చాలా చోట్ల పనులు ఇంకా మొదలు కాలేదా? ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా తూతూ మంత్రంగా నాలా పూడికతీత పనులను ముగుస్తుందా? అంటే క్షేత్రస్థాయి పరిస్థితులు అవుననే సమాధానం ఇస్తున్నాయి. వాస్తవంగా జనవరి నుంచి మే నెలాఖరు వరకు పనులకు అనుకూల సమయం.. ప్రాజెక్టు అయినా, నాలా పనులైన యుద్ధ ప్రాతిపదికన చేపట్టి నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేయవచ్చు. కానీ ఘనత వహించిన బల్దియా ఇంజినీరింగ్ నిర్వహణ విభాగం నాలా పూడికతీత పనులను సకాలంలో చేపట్టి పూర్తి చేయాల్సిన చోట మూడు నెలలుగా టెండర్ల దశలోనే ఊగిసలాడుతున్నది. జోనల్ వారీగా కోటి రూపాయల పనులను 10 విభాగాలుగా విభజించిన అధికారులు గ్రౌండింగ్‌లో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేమితో పనుల పారదర్శకతపై అనుమానాలు లేకపోలేదు.

బాలానగర్‌లో నాలా దుస్థితి ఇది..

డిసెంబర్‌లో జరగాల్సిన పూడికతీత..

ప్రతి ఏడాది దాదాపు రూ.60 కోట్ల మేర నాలా పూడికతీత పనులకు టెండర్లు పిలిచి తొలకరి జల్లులు కురిసే నాటికల్లా పూడికతీత పనులను పూర్తి చేసి వరదనీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు చేపట్టాలి. కానీ ఘనత వహించిన జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ నిర్వహణ విభాగం మీనమేషాలు లెక్కిస్తున్నది. ఇప్పటికే చెల్లించాల్సిన1400 కోట్ల రూపాయలు అందకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు మొరాయిస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే జీహెచ్ఎంసీ పనులంటేనే కాంట్రాక్టర్లు హడలెత్తిపోయి దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఇంజినీరింగ్ విభాగం సారథ్యంలో జరగాల్సిన నాలా పూడికతీత ఇప్పటివరకు చాలాచోట్ల ప్రారంభం కాలేదు. డిసెంబర్‌లో పనులకు టెండర్లు పిలిచి జనవరిలో ప్రారంభించి మే నెలాఖరు కల్లా పూర్తి చేయాల్సిన చోట.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. దీనికి తోడు ఎస్ఎన్‌డీపీ మొదటి దశను ఇంకా పూర్తి చేయలేకపోవడం ..పూడికతీత పనులు చేపట్టకపోవడంపై ప్రజల్లో ఆందోళన నెలకొంది.

ఆలస్యంతో పొంచి ఉన్న ప్రమాదం

జీహెచ్ఎంసీ పరిధిలో సుమారుగా 1302 కిలోమీటర్లు పొడవైన వరద నీటి కాలువలున్నాయి. వీటిలో పెద్ద నాలాల పొడవు 390 కిలోమీటర్లు. చిన్న నాలాలు 912 కిలోమీటర్ల పొడవున్నాయి. వరద నీరు సాఫీగా దిగువకు వెళ్లేందుకు అవసరమైన మరమ్మతులకు, పునరుద్ధరణ పనులకు ప్రతి సంవత్సరం రూ.50 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారు.ఈ పనులు సకాలంలో జరిగితే ముంపు తీవ్రత అంతగా ఉండదు. కానీ వేర్వేరు కారణాలను సాకుగా చూపించి అధికారులు ఆలస్యం చేస్తుండడంతో నీటి ముంపు తప్పడం లేదు. ప్రతి ఏటా వర్షాకాలం ప్రారంభం నాటికల్లా పూర్తి కావాల్సిన పనులను 80 శాతమే పూర్తి చేసి తొలకరి జల్లు నాటికి పూడికతీతను వర్షార్పణం చేస్తున్న దాఖలాలు ఉన్నాయి. ఇందులో భాగంగానే 2024 సంవత్సరంలో 3.12 లక్షల క్యూబిక్ మీటర్ల పూడికను తీసి 81 శాతం పనులతో ముగించారు. రికార్డుల్లో మాత్రం ఐదు లక్షల క్యూబిక్ మీటర్ల పూడిక తీస్తున్నట్లు లెక్కలు చూపిస్తూ పనుల పారదర్శకతకు పాతర వేస్తుండడం గమనార్హం.

భూములు వేలం వేస్తే ఉద్యమమే

హెచ్‌సీయూ విద్యార్థుల హెచ్చరిక

క్యాంపస్‌లో మాషల్ జులూస్‌కు పిలుపు

సిటీబ్యూరో: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను వేలం వేస్తే కాంగ్రెస్ సర్కారుపై యుద్ధం ప్రకటిస్తామని హెచ్‌సీయూ విద్యార్థులు హెచ్చరించారు. భూముల పరిరక్షణ కోసం యూనివర్సిటీ క్యాంపస్‌లో 'మాషల్ జులూస్'కు పిలుపునిచ్చారు. వర్సిటీలోని 5 వేల మంది విద్యార్థులు ఇందులో పాల్గొనాలని జేఏసీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. వర్సిటీకి చెందిన 400 ఎకరాల భూములను వేలం వేస్తామన్న ప్రభుత్వ ప్రకటన వెనక్కి తీసుకునేదాకా నిరసనలు కొనసాగించాలని నిర్ణయించారు. వర్సిటీ పరిధి భూములన్నింటినీ రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. భూములను రిజిస్ట్రేషన్ చేయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని జేఏసీ ప్రతినిధులు వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌ను కలిసి విన్నవించినట్లు తెలిపారు.

గ్రేటర్ జనంపై చలాన్ల మోత

పది రోజుల్లో పది లక్షల జరిమానాలు

సిటీబ్యూరో: గ్రేటర్ జనంపై జీహెచ్ఎంసీ చలాన్ల మోత మోగిస్తున్నది. రహదారులపై చెత్త వేసిన వారిపై రూ. 500ల నుంచి రూ. 25వేల వరకు, భవన నిర్మాణ వ్యర్థాలు వేసిన వారికి రూ. 25 వేల నుంచి రూ.2 లక్షల వరకు జరిమానాలు విధిస్తున్నది. సర్కిల్ స్థాయి అధికారులు వివిధ వ్యాపారులు, దుకాణాదారులే లక్ష్యంగా స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. ఇప్పటి వరకు సీసీఎంఎస్ ద్వారా రూ. 10 లక్షల జరిమానాలు విధించినట్లు అధికారులు పేర్కొన్నారు. రోడ్ల మీద చెత్త వేసినందుకు రూ. 5 లక్షల 41వేల ఫైన్ వేసినట్లు చెప్పారు. భవన నిర్మాణ వ్యర్థాలు రోడ్ల మీద వేసిన 37 మందిని గుర్తించి రూ. 5 లక్షల 50వేలు వేసినట్లు చెప్పారు. శానిటేషన్, టౌన్‌ప్లానింగ్ శాఖలు సంయుక్తంగా కలిసి 259 మంది నుంచి రూ.10 లక్షల జరిమానాలు వేశామన్నారు.